క్లుప్తంగా

శివాలయం నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం


అలయ నిర్మాణ కమిటీ, గ్రామపెద్దలకు చెక్కు అందజేస్తున్న దాతలు

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలస గ్రామంలో శివాలయం నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన ఇనుముల శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య పార్వతి, కుమారులు రమేష్,రాజు రూ.10 లక్షలు విరాళం ప్రకటించారు. గ్రామపెద్దలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు మంగళవారం రాత్రి చెక్కు అందజేశారు.దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఇప్పిలి అనంతం

చీపురుపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ మండలఅధ్యక్షుడు ఇప్పిలి అనంతం అన్నారు. రామలింగాపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఫ్లడ్‌లైట్‌ల వెలుగులో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో 10 జట్లు పాల్గొంటున్నాయి కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి మొక్కలు పంపిణీ చేస్తున్న హరిత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

వేపాడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, విరివిగా మొక్కలు నాటాలని హరిత స్వచ్ఛందసేవా సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. సంక్రాంతి నేపథ్యంలో హరిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాతశింగరాయి గ్రామంలో మంగళవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. అలాగే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పోటీల్లో పాల్గొన్న వారికి గులాబీ మొక్కలను పంపిణీ చేశారు. హరిత స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బొండపల్లి: మకర సంక్రాంతి సందర్భంగా దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి అలయంలో అమ్మవారు మంగళవారం భక్తులకు సంక్రాంతి లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు దూసి శ్రీధర్ అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

కాలువల్లో పూడిక తీత


జేసీబీ సహాయంతో చేపడుతున్న పూడిక తీత, గుంతలు పూడ్చే పనులు

సాక్షి ఎఫెక్ట్

వేపాడ: స్థానిక ప్రధాన రహదారిలోని సైడు కాలువల్లో పూడిక తీయకపోవడంతో వాడుకనీరు రోడ్డుపైకి చేరి చెరువును తలపిస్తుండడంతో 'పూడికలు తొలగించండి' శీర్షికతో సాక్షిలో ఈనెల 13వ తేదీన కథనం ప్రచురితమైంది. కథనానికి గ్రామసర్పంచ్ మిరపార అర్జునమ్మ స్పందించి బుధవారం గ్రామపెద్దల సహకారంతో పూడిక తీత పనులను జేసీబీతో చేయించారు.అలాగే రోడ్డుపై గుంతలను పూడ్చారు.

అట్రాసిటీ కేసు నమోదు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మద్యం సేవించి తనను కులం పేరుతో దూషించారని తుర్రు సింహాచలం అనే వ్యక్తి ఫిర్యాదు చేశారని స్థానిక ఏఎస్ఐ శంకరరావు బుధవారం తెలిపారు. ఆ అయిదుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఏఎస్ఐ పేర్కొన్నారు.

సందడిగా సంక్రాంతి...
కనుల పండువగా కనుమ


వేపాడ: జగ్గయ్యపేటలో నిర్వహించిన పోటీల్లో ముగ్గలు వేస్తున్న యువతులు


చీపురుపల్లి: పుర్రేయవలసలో నిర్వహించిన పోటీల్లో మహిళలు వేసిన ముగ్గులు


చీపురుపల్లి: కనుమ సందర్భంగా చీపురుపల్లిలో గోమాతకు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

తెలుగు ప్రజల పెద్ద పండగ సంక్రాంతి సంబరాలు గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పల్లెలు, పట్టణాల్లో సోమ, మంగళవారాల్లో ఘనంగా జరిగాయి. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఉద్యోగా లు చేస్తున్న వారు వేలాది మంది సొంత కుటుంబాలతో సహా ఊళ్లకు చేరుకోవడంతో ఏ గ్రామంలో చూసినా సందడి వాతావరణం కనిపించింది. ఇళ్ల ముందు మహిళలు అందమైన రంగ వల్లులు, హరిదాసు కీర్తనలు గంగిరెద్దుల ఆటలు కనిపించా యి. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి కుటుంబసమేతంగా పూజలు చేశారు. పితృదేవతలకు కొత్త దుస్తులు చూపించారు. పాడి పంటలు బాగుండాలని రైతులు పూజలు చేశారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా గడిపారు.

- వేపాడ మండలంలోని జగ్గయ్యపేట, వల్లంపూడి గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, పిల్లలకు సైకిల్, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.
- గుర్ల మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల ఆధ్వర్యంలో ముగ్గులు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరించారు.
- మెరకముడిదాం మండల కేంద్రంతో పాటు, భీమవరం గ్రామంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో ముగ్గల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.
- బొండపల్లి మండలంలోని కొండకిండా గ్రామంలో యువత, గ్రామపెద్దల ఆధ్వర్యంలో వాలీబాల్, టగ్‌ఆఫ్‌వార్, క్రికెట్ , ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ పెద్దమజ్జి ఆదిలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.
- చీపురుపల్లి మండంలోని పుర్రేయవలస గ్రామస్తులు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.విజేతలకు రాజమహేంద్రవరం జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, గ్రామపెద్దలు బహుమతులు పంపిణీ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్


గుర్ల: గుర్లలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించిన యువతిని సన్మానిస్తున్న గుర్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు


మెరకముడిదాం: భీమవరంలో ముగ్గులను తిలకిస్తున్న గ్రామపెద్దలు


బొండపల్లి: కొవ్వాడపేట రామాలయంలో భజన చేస్తున్న గ్రామస్తులు


బొండపల్లి: కొండకిండాంలో టగ్‌ఆఫ్ వార్ పోటీలో తలపడుతున్న యువకులు, పిల్లలు


వేపాడ: జగ్గయ్యపేటలో సైకిల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న పిల్లలు


గుర్ల: గుర్లలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు


చీపురుపల్లి: పుర్రేయవలసలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజమహేంద్రవరం డీఈఓ వాసుదేవరావు


బొండపల్లి: బొండపల్లిలో పశువులకు పూజలు చేస్తున్న చిన్నారులు


వేపాడ: జగ్గయ్యపేటలో పిల్లలకు ఆటల పోటీలు

పెదనడిపల్లి మాజీ సర్పంచ్ మృతి


మన్నె పెదసత్య నారాయణ(ఫైల్)

చీపురుపల్లి: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని పెదనడిపల్లి మాజీ సర్పంచ్, విశ్రాంత ఉపాధ్యాయుడు మన్నె పెదసత్యనారాయణ(75) బుధవారం మృతి చెందారు. ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన తర్వాత 2006లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పెదనడిపల్లి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా సేవలు అందిస్తూనే సామాజిక స్పృహతో మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులుతో కలిసి నేత్ర, అవయవదానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దీంతో గ్రామస్తులు నేత్ర, అవయవదానంకు ముందుకు వచ్చి అంగీకారపత్రాలను అప్పట్లోనే అందజేశారు. మరోవైపు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ద్వారా ఆధ్యాత్మిక సేవలను విరివిగా అందించారు. అదే గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సొంత నిధులు రూ.లక్ష వెచ్చించి విద్యార్థులకు సైకిల్ షెడ్ నిర్మించారు.

కబడ్డీ క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులతో గ్రామపెద్దలు

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామంలో వినాయక యవజన సంఘం సంక్రాంతి సందర్భంగా గ్రామానికి చెందిన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారులు లగు డు అజయ్‌కుమార్, పతివాడ వినయ్‌కుమార్, కోచ్ ఆల్తి తాతబాబును సర్పంచ్ యాళ్ల వెంకటరమణ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు.సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన తాతబాబు తదితరులు గ్రామానికి మంచి పేరు తెచ్చి పెట్టారని సర్పంచ్ వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.ఎంపీటీసీ బోదల దేముడు, స్థానిక పెద్దలు కొసరి రామారావు, ఆల్తి బుచ్చిబాబు, ఆల్తి రమణ, తానవరపు అప్పలనాయుడు, కబడ్డీ క్రీడాకారులు టొంపల అప్పన్న, మత్తి గురుమూర్తి, మండల సతీష్, సారిక కోటరావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ఫలాలతో అలంకరణ


పండ్ల అలంకరణలో బాలాంజనేయస్వామి

వేపాడ: రామస్వామిపేట గ్రామ సమీపంలోని శ్రీఅష్టాంశ వరద బాలాంజనేయ ఆలయంలో సంక్రాంతి సందర్భంగా స్వామి వారిని మంగళవారం వివిధ ఫలాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామివారికి అష్టోత్తర శతనామ, ప్రత్యేక పూజలు చేశారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు శ్రీధరాచార్యులు

మెరకముడిదాం: సంక్రాంతి సందర్భంగా భైరీపురంలోని పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు సముద్రాల శ్రీధరాచార్యులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు వేకువ జాము నుంచే స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు భజనలు చేశారు. అలాగే గ్రామంలోని శ్రీకృష్ణుడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా బ్రహ్మలింగేశ్వరస్వామి తీర్థం


కొండగుళ్లులో తోడపెద్దును కొండ ఎక్కిస్తున్న భక్తులు

వేపాడ: మండలంలో ప్రసిద్ధి చెందిన కొండగుళ్ల బ్రహ్మలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సింహాద్రప్పన్న తోడపెద్దును భక్తులు కొండ ఎక్కించి ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేయించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే బొద్దాంలో నెయ్యిల పేరంటాలమ్మ తీర్థం నిర్వహించారు.

ఘనంగా లక్ష్మమ్మ తల్లి జాతర


గంట్యాడ: పూజలందుకుంటున్న లక్ష్మమ్మ తల్లి

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో లక్ష్మమ్మ తల్లి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏటా కనుమ పండగ నాడు అమ్మవారి జాతర జరపడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు


పరుగుతీస్తున్న ఎడ్లు


ఎడ్ల పరుగు ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

వేపాడ: మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామంలో కృష్ణరాయుడు స్వామి తీర్థం సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించి న ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. సర్పంచ్ బాలబాబు, గ్రామపెద్దలు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 15 జతల ఎడ్లు పాల్గొనగా, దేవరాపల్లికి చెందిన లక్ష్మీనరసింహ ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచి రూ.12వేలు నగదు బహుమతి గెలుచుకున్నాయి. రెండోస్థానంలో వల్లంపూడి గ్రామానికి చెందిన సిద్ధివినాయక ఎడ్లు, మూడో స్థానంలో వావిలపాడు గండి వెంకటరావు ఎడ్లు, నాలుగో స్థానంలో కలగాడకు చెందిన పి.రామునాయుడు ఎడ్లు నిలిచాయి. ఆరువేలు చొప్పున నగదు బహుమతులు అందచేసారు. విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, నాయకులు కె.పెదనాయడు,బి.శ్రీను,తదితరులు నగదు బహుమతులు అందజేశారు. తీర్థం సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

లక్కీ డ్రా విజేతలకు బహుమతులు


ప్రథమ బహుమతి గెలుచుకున్న కృష్ణవేణికి ఎల్ఈడీ టీవీ అందజేస్తున్న గ్యాస్ ఏజెన్సీ ప్రతినిదులు

గజపతినగరం: హెచ్‌పీ గ్యాస్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా స్థానిక వీఎస్ఆర్ గ్యాస్ ఏజెన్సీ వారు ఇటీవల లక్కీడ్రా నిర్వహించా రు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పి.కృష్ణవేణి, జి.సావిత్రి, జి.రామకృష్ణకు వరుసగా ఎల్ఈడీ టీవీ,వాటర్ ప్యూరిఫైయిర్, గ్రైండర్‌ను బహుమతులుగా అందజేశారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్లు వి.సోమశేఖర్, ఎస్.బంగారునాయుడు, సిబ్బంది జి.మహేష్ పాల్గొన్నారు.

పేదలకు వస్త్రదానం


మెరకముడిదాం: ఉత్తరావల్లిలో పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ సత్యనారాయణ, వర్మ


గజపతినగరం: రామన్నపేటలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ సూరినాయుడు


చీపురుపల్లి: ఇటకర్లపల్లిలో రైతులకు తువ్వాళ్లు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు అప్పలనాయుడు


వేపాడ: జగ్గయ్యపేటలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న హరిత స్వచ్ఛంద సంస్థ సభ్యులు


గజపతినగరం: వేమలిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీను

గజపతినగరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని పలుగ్రామాల్లో దాతలు పేదలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. రామన్నపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ పొట్నూరు సూరినాయుడు 300 మంది మహిళలు, వృద్ధులకు చీరలు, లుంగీలు, కండువాలు, వేమలి గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ బైరెడ్డి లక్ష్మి, శ్రీను దంపతులు 200 మంది మహిళలు, వృద్ధులకు దుస్తులు అందజేశారు.

రైతులకు తువ్వాళ్లు...

చీపురుపల్లి: మండలంలోని ఇటకర్లపల్లి గ్రామంలో 250 మంది రైతులకు యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు తువ్వాళ్లు పంపిణీ చేశా రు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ సంక్రాంతికి కూడా రైతులకు తువ్వాళ్లు పంపిణీ చేశామని చెప్పారు. వ్యవసాయం బాగుంటేనే వ్యవస్థ బాగుంటుందని, ప్రతి ఒక్కరూ రైతులను గౌరవించాలని కోరారు.

ఉత్తరావల్లిలో..

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లిలో గ్రామానికి చెందిన చింతలపాలి సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం, సంక్రాంతి నేపథ్యంలో ఆయన కుమారుడు వర్మ 65 మంది పేదలకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మండల సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హరిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేటలో హరిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వంటాకు రామసత్యం, వెంకటలక్ష్మి దంపతులకు ఆర్థికసహాయం చేశారు. ఆ సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు


కూలిన కల్వర్టు స్థానంలో తాత్కాలికంగా వేసిన గ్రావెల్ రోడ్డు

వేపాడ: మండలంలో బల్లంకి నుంచి ఆనందపురం వెళ్లే రోడ్డులో రైవాడ కాలువపై ఇటీవల కల్వర్టు కూలిపోయింది. బానాది,బల్లంకి గ్రామపెద్దలు మంగళవారం స్పందించి తాత్కాలికంగా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కాలువపై తాటి దుంగలు అమర్చి గ్రావెల్ వేయించడంతో వాహనాల రాకపోకలు సాగించేందుకు మార్గం సుగుమం అయింది. జీవీఎంసీ అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని ఆమార్గంలో ప్రయాణాలు సాగించే బానాది,ఎం.శింగవరం, బల్లంకి గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సమస్యను రైవాడ కాలువ వర్క్‌ఇన్‌స్పెక్టర్ పోలినాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా..కల్వర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరుకాగానే పనులు చేపడతామని తెలిపారు.